వైభవంగా గోదాదేవి కల్యాణం




గోదాదేవి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ సునీత ప్రకాష్ గౌడ్, భక్తులు



రాంనగర్ రామాలయంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత నాగేష్ ముదిరాజ్, తదితరులు

రాంనగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ రామాలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దేవాదాయశాఖ ఆధ్వర్యంలో గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అడిక్‌మెట్ కార్పొరేటర్ సునీత ప్రకాష్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.నాగేష్ ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ డి.రవియాదవ్, మాజీ చైర్మన్ రాజేశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు డి. ఆనందు, గోవర్ధన్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వెంకటరమణాచార్యులు, వేణుగోపాల్‌శర్మ పాల్గొన్నారు. ఈ కల్యాణ మహోత్సవానికి రాంనగర్ పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదా రంగనాథ స్వాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కల్యాణ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తరుణ్‌గౌడ్ పాల్గొన్నారు.

భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలోని సంజీవ హనుమాన్ దేవాలయంలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పద్మశాలి సంఘం రాష్ట్ర కోశాధికారి బింగి నవీన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, కోశాధికారి వెంకటేష్, ఉపాధ్యక్షులు కృష్ణ, సలహాదారులు సుదర్శన్, పుండరీకం, సీతా మార్కెండయ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో

గోల్నాక: గోల్నాక డివిజన్ ఛేనెంబర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం శ్రీరంగనాథ గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ శాశ్వత ధర్మకర్త రావి కమలాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాకరాజు వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి కదురు శివరామకృష్ణ, కోశాధికారి పొడుగు సత్యనారాయణనేత, జాయింట్ సెక్రటరీ గంగాపురం యాదగిరిగౌడ్, సభ్యులు నూనెముంతల అంజయ్యగౌడ్, అరిగె రాజు, కుంట బాలనర్సు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో

చిక్కడపల్లి: ధనుర్మాస మాసం సందర్భంగా సోమవారం రాత్రి చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని సుప్రసిద్ధ ఆంజనేయస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. వేడుకల్లో భక్తులు, ఆలయ ఈవో దేవనాథం, పునర్‌నిర్మాణ కమిటీచైర్మన్ జానకిసుధాకర్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో..

చిక్కడపల్లి: ధనుర్మాసం సందర్భంగా సోమవారం రాత్రి చిక్కడపల్లిలోని సుప్రసిద్ధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్ గౌడ్, ఈవో అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గోల్నాక డివిజన్ ఛేనెంబర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో..



చిక్కడపల్లిలో గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఎదుర్కోళ్ళు నిర్వహిస్తున్న భక్తులు

భోగి మంటల లోగిళ్లు.. పతంగుల కేరింతలు



భోగిమంటలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో సోమవారం ప్రజలు భోగి మంటలు, ఇళ్ల ఎదుట ముగ్గులేసి, రంగులద్ది సంబురాలు చేసుకున్నారు. చిన్నారులు, పెద్దలు, యువతీయువకులు ఇళ్లపై పతంగులను ఎగురేస్తూ కేరింతలు కొట్టారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, వివిధ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ సూచించారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని సోమవారం నగరంలోని నీలోఫర్ ఆసుపత్రితో పాటు పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిరుపేదలకు భోజన ప్యాకెట్లను ఉచితంగా రామదూత చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పతంగుల మాంజాల విక్రయ షాపుల్లో సోమవారం సీఐ రాంబాబు తనిఖీలు నిర్వహించారు.

- ముషీరాబాద్/బర్కత్‌పుర/రాంనగర్/గోల్నాక/చిక్కడపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి)



భోగి మంటల్లో పాల్గొన్న ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ద్రోణం రాజు, రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, ఆనంద్, సునీత తదితరులు



పేదలకు అన్నదానం చేస్తున్న రామదూత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు



బాకారంలో మాంజాలను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాంబాబు



గోల్నాకలో పతంగుల కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు



కుమార్తెతో అఫ్సానా బేగం (ఫైల్)

భర్తతో గొడవపడి.. కుమార్తెతో మహిళ అదృశ్యం

బర్కత్‌పుర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి ఓ మహిళ తన కుమార్తెను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాచిగూడ ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక న్యూ ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న షేక్ మహ్మద్ వృత్తిరీత్యా హెల్పర్. అతనికి భార్య అఫ్సనా బేగం మూడేళ్ల వయస్సు గల కుమార్తె మేహరా బేగం ఉన్నారు. సోమవారం అఫ్సనాబేగం భర్తతో గొడవ పడింది. భర్త షాప్‌కు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి భార్య కుమార్తె కనిపించలేదు. దీంతో మహ్మద్ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు కాచిగూడ పీఎస్‌లో అతడు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు

ఉద్యోగ విరమణ వయస్సు పెంచొద్దు

జాతీయ ఓబీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ

బర్కత్‌పుర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ వయస్సును 63 ఏళ్లకు పెంచే ప్రతిపాదనలను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని జాతీయ ఓబీసీ మేధావుల పోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయస్సును పెంచితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆయన అన్నారు. సోమవారం బర్కత్‌పురలోని మేధావుల ఫోరం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొన్నిరోజులుగా వివిధ వార్తా చానళ్లలో ఉద్యోగ విరమణ పెంపుపై కథనాలు ప్రచారం అయ్యాయని వీటిని ప్రభుత్వం ఖండించలేదని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచి పెద్దతప్పు చేసిందని దాని పర్యవసానంగా 2023 ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు గుణపాఠం చెప్పారని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి లక్షలాది మంది నిరుద్యోగులు చేయూతనందించారని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సు పెంచితే మళ్లీ గుణపాఠం చెప్పే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి ఉద్యోగ విరమణ వయస్సును పెంచవద్దని అభ్యర్థించానని ఆయన తెలిపారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన ఆళ్ల రామకృష్ణ

హర్ ఆర్ట్ గ్యాలరీ అద్భుతం

చిక్కడపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హర్ ఆర్ట్ గ్యాలరీ అద్భుతంగా ఉందని ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కేవీ రమణాచారి అన్నారు. ప్రముఖ హస్త కళాకారిణి కమలప్రసాదరావు రూపొందించిన వైవిధ్యభరిత అద్భుత హస్తకళాకారుల హర్ ఆర్ట్ గ్యాలరీని సోమవారం ఆయన సందర్శించారు. గ్యాలరీ ఎండీ ప్రసాదరావు, డైరెక్టర్ కమలాప్రసాదరావు సన్మానించారు. హర్ ఆర్ట్ గ్యాలరీ ప్రజాసంబంధిత విభాగం చైర్మన్ డా.కె.ధర్మారావు, అమర్‌కాంత్‌రెడ్డి, కరుణాకర్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, రఘురామ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కరాటే మాస్టర్ కుటుంబానికి ఆర్థికసాయం

చిక్కడపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన కరాటే మాస్టర్ బి.బస్వరాజు కుటుంబానికి రుద్రమదేవి అకాడమీ తరఫున ఆర్థిక సాయం అందించారు. సోమవారం అశోక్‌నగర్‌లోని జవహర్‌నగర్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.1.10 లక్షలను అకాడమీ తరఫున అకాడమీ చైర్మన్ డా.డీఎస్ రెడ్డి బస్వరాజు సతీమణికి అందజేశారు. బస్వరాజు ఆర్థిక ఇబ్బందుల నుంచి కొంత ఊరట లభించేలా ఈ సాయం ఉపయోగపడుతుందని డీఎస్‌రెడ్డి, కరాటే మాస్టర్ రవి, లక్ష్మి పేర్కొన్నారు. కన్నన్‌గౌడ్, సాయియాదవ్, శ్రీధర్, బాలప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

అలరించిన నృత్యనీరాజనం

చిక్కడపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానందుని స్మరిస్తూ కూచిపూడి నాట్యభారతి ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన నృత్య నీరాజనం అందరినీ అలరించింది. నాట్యగురువు ఆకుల శ్రీనివాస్‌కుమార్ శిష్యబృందం అలేఖ్య అభిజ్ఞ దేదీప్య, తశ్విక, నితిక, హరిదియు తదితరులు నర్తించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు పీవీ.మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌గాంధి, శ్రీనివాస్‌కుమార్, శంకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.



బీసీ లెక్చరర్ల రాష్ట్ర సదస్సులో ప్రసంగిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, వివిధ సంఘాల నేతలు

బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం.. రాజ్యాంగ సవరణ చేయాలి

బర్కత్‌పుర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లను పొందుతున్న ఏ వర్గానికి విధించని క్రీమిలేయర్‌ను బీసీలకే విధించడం ఏమిటని.. దీన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాచిగూడ అభినందన గ్రాండ్‌హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాముని సుదర్శన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆర్. కృష్ణయ్య మాట్లాడారు. రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బలమైన బీసీ ఉద్యమం చేపడితే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి పలు పథకాలను ప్రవేశపెడుతుందని సూచించారు. రిజర్వేషన్లు పెట్టింది పేదరిక నిర్మూలన కోసం కాదని సామాజిక అభివృద్ధి కోసమేనని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు, బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మారాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో దృష్టి కుంభాల కోసం బియ్యం పోస్తున్న ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి దంపతులు

మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ముషీరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ బాకారంలో ప్రసిద్ధి గాంచిన బ్రహ్మారాంబ మల్లికార్జున స్వామి (మల్లన్న) ఆలయంలో సోమవారం స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి దంపతులు దృష్టికుంభాల కోసం బియ్యం పోసి పూజలు ప్రారంభించారు. ఒగ్గు పూజారులతో మల్లన్న స్వామిని కొలిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిళ, మల్లికార్జునరెడ్డి, హారిక, సురేష్, రాజు, గోపి, ఒగ్గు పూజారులు సిద్దం నాగేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మందా జగన్నాథంకు ఘన నివాళి

రాంనగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథం తెలంగాణ రాష్ట్రానికి అందించిన సేవలు మరువలేనివి అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ పేర్కొన్నారు. సోమవారం చంపాపేటలోని తన నివాసంలో వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... నాలుగు సార్లు లోక్‌సభ సభ్యుడిగా, ఒక్కసారి తెలంగాణ ప్రత్యేక ఢిల్లీ ప్రతినిధిగా పనిచేసి దళిత, బహుజనుల కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు.



మంద జగన్నాథం భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బాలగోని బాలరాజ్‌గౌడ్, వెంకన్న



పాశం సాయి కృష్ణ యాదవ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు లక్ష్మణ్‌రావు, విన్నూ ముదిరాజ్ తదితరులు

బీజేపీ బలోపేతానికి కృషిచేస్తా : సాయికృష్ణ యాదవ్

రాంనగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లో బీజేపీని బలోపేతం చేయడానికి అంకిత భావంతో పనిచేస్తానని బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ నూతన అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ తెలిపారు. డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను సోమవారం డివిజన్‌లో బీజేపీ సీనియర్ నాయకులు ఎంసీ మోహన్, బి.లక్ష్మణ్‌రావు, విన్నూ ముదిరాజ్‌తో పాటు పలువురు లలితనగర్‌లో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.నరేష్ గౌరీ, శంకర్‌దర్గ, నరసింహరావు, జగదీష్, ప్రదీప్, వంశీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా శ్రీధర్‌గౌడ్



గోల్నాక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సూదగాని శ్రీధర్‌గౌడ్ బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ బాధ్యతలు అప్పగించిన కేంద్రమంతి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జికిషన్‌రెడ్డి, పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మూల రవీందర్‌గౌడ్‌కు శ్రీధర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

టీడీపీలో చేరిన బీఆర్ఎస్ రాష్ట్ర నేత

రాంనగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి):టీడీపీ సిద్ధాంతాలు చంద్రబాబు నాయుడు పనితీరు చూసి తెలంగాణలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు టీడీపీలో తిరిగి స్వచ్ఛందంగా చేరుతున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్ కుమార్‌గౌడ్ తెలిపారు. నాంపల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎంఏ సిద్దికి తన అనుచరులతో సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శి కిషోర్, పలుస బాల రాజు గౌడ్, నాయకులు నాగు, నాగేష్, కట్టా రాములు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.